దాహం... దాహం

- తాగునీటి కోసం అల్లాడుతున్న నక్కపల్లి ప్రజలు
- రెండు నెలలుగా నిలిచిన నీటి సరఫరా
- ఉపమాక, మరో ఐదు గ్రామాల్లో ఇదే పరిస్థితి
- పట్టించుకోని అధికారులు


నక్కపల్లిలో నిర్మించి ఓవర్ హెడ్‌ట్యాంకు


మోటారు రిపేరుకు రావడంతో నిరుపయోగంగా ఉన్న సంప్

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లిలో దాహం కేకలు మిన్నంటుతున్నాయి. రెండు నెలల నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. పట్టించుకునే నాథుడే కరువయ్యాడంటూ ప్రజలు ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమిపాలనలో గుక్కెడు నీళ్ల కరువయ్యాయంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. సుమారు 10 వేల మంది జనాభా నివసించే మండల కేంద్రం నక్కపల్లిలో తాగునీటి సరఫరా నిలిచిపోయినప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఉపమాక, మరో ఐదు గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఈ గ్రామాల్లో సుమారు 15 వేల మంది జనాభా నివసిస్తున్నారు. మండల కేంద్రంలోనే ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఏఈ కార్యాలయాలు ఉన్నప్పటికీ తాగునీటి సరఫరా నిలిచిపోయిన విషయం గుర్తించినప్పటికీ పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదంటూ నక్కపల్లి గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. హోంమంత్రి, స్థానిక ఎమ్మెల్యే అయిన వంగలపూడి అనిత నివసిస్తున్న మండల కేంద్రంలోనే నీటి సరఫరా నిలిచిపోయి రెండు నెలుల గడుస్తున్నా అధికారులు పట్టించుకోలేదంటే ఇక గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నీటి సరఫరాలేక లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకులు, సంప్‌లు నిరుపయోగంగా ఉన్నాయి. నక్కపల్లి మండల కేంద్రంతోపాటు, ఉపమాక, పరిసర గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. మండలంలో నక్కపల్లి, ఉపమాక, చందనాడ, సారిపల్లిపాలెం, వెదుళ్లపాలెం, మనబానవానిపాలెం, కాగిత, న్యాయంపూడి, పెదతీనార్ల, సీహెచ్‌ఎల్ పురం, తమ్మయ్యపేట, జానకయ్యపేట తదితర గ్రామాలకు తాగునీరు సరఫరా చేసేందుకు ఎస్.రాయవరం మండలం గొట్టివాడ వద్ద వరాహానదిలో బోర్‌వెల్ ఏర్పాటు చేశారు.అక్కడినుంచి పైపులైన్ల ద్వారా ఈ గ్రామాల వారికి తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఈ పైపులైను ఏర్పాటు చేసి రెండు దశాబ్దాలు పైగా గడుస్తోంది. తుపానులు, భారీ వర్షాలకు పైపులైన్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో వారానికి ఒకసారి మాత్రమే నీటి సరఫరా జరుగుతోంది. మరమ్మతులు చేపట్టకపోవడంతో అడపా దడపా మాత్రమే నీటిని విడుదల చేస్తున్నారు. పైపుల ద్వారా సరఫరా అయిన నీటిని సంప్‌లలో నింపి అక్కడనుంచి ఓవర్ హెడ్ ట్యాంకులకు అక్కడనుంచి గ్రామాల్లో ఏర్పాటు చేసిన పైపులైన్ల ద్వారా కుళాయిలకు నీటిని సరఫరా చేస్తున్నారు. రెండునెలలనుంచి గొట్టివాడనుంచినీటి సరఫరా నిలిచిపోవడంతో ఈ గ్రామాలకు తాగునీరు రావడం లేదు. దీంతో ప్రజలు గుక్కెడు నీటి కోసం అల్లాడుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఒకరిపై ఒకరు నెట్టేసుకుంటూ సమస్య పరిష్కరించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు, నక్కపల్లి సంప్‌కు ఏర్పాటు చేసిన మోటారు కూడా రిపేరుకు గురైంది, బాగుచేయించడానికి తీసుకెళ్లి ఐదురోజులు గడుస్తున్నా ఇంతవరకు తీసుకురాలేదు. నిర్వాహణ బాధ్యతలు చూస్తున్న కాంట్రాక్టర్ నిమ్మకు నీరెత్తినట్టువ్యవహరిస్తున్నాడు. దీంతో ప్రజలు బావులు, గొట్టపు బావులను ఆశ్రయిస్తున్నారు. ప్రైవేటు ఆర్‌వో ప్లాంట్ల నుంచి డబ్బాల్లో నీటిని కొనుగోలు చేసి, తాగాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం పనితీరు చాలా అధ్వానంగా ఉందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

సమస్య పరిష్కరించకపోతే ఆందోళన చేస్తాం



మండల కేంద్రం నక్కపల్లిలో రెండునెలల నుంచి తాగునీరు సరఫరా కావడం లేదు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోవడం లేదు. గుక్కెడు నీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. ఫిర్యాదు చేస్తే ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు ఉంది. మండల కేంద్రంలోనే ఈ పరిస్థితి ఉంటే ఇక గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. గొట్టివాడనుంచి నీరు రావడం లేదని చెబుతున్నారు. పైపులైన్లు మరమ్మతులు చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చింది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించకపోతే ఆర్ డబ్ల్యూఎస్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం.

– వీసం నానాజీ, వైస్ ఎంపీపీ, నక్కపల్లి

తాగునీటి సరఫరా పునరుద్ధరించాలి



నక్కపల్లిలో గుక్కెడు నీటికోసం అల్లాడాల్సిన పరిస్థితులు దాపురించాయి. తాగునీటిని సరఫరా చేయలేకపోవడం దారుణం.మండలకేంద్రంలోనే ఇటువంటి పరిస్థితి ఉంటే గ్రామాల్లో ఎలా ఉంటుందో వేరే చెప్పనక్కర్లేదు. ఉన్నతాధికారులు స్పందించి నీటి సరఫరా పునరుద్ధరించాలి.

– ఎల్లేటి సత్తిబాబు, నక్కపల్లి

సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

నక్కపల్లిలో తాగునీటి సమస్య విషయం ఇప్పుడే నా దృష్టికి వచ్చింది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాను. పైపులైన్లు మరమ్మతులకు చేరుకోవడం వల్ల నీటి సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతోంది.

– సీతారామరాజు, ఎంపీడీవో, నక్కపల్లి

క్లుప్తంగా

రేషన్ కార్డుదారులకు మెరుగైన సేవలందించాలి

మునగపాక: రేషన్ కార్డుదారులకు మెరుగైన సేవలందించాలని తహసీల్దార్ పి.సత్యనారాయణ తెలిపారు. శనివారం సాయంత్రం రెవెన్యూ కార్యాలయంలో రేషన్ డిపో డీలర్లతో ఆయన సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరకుల బట్వాడాలో డీలర్లు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్డుదారులకు అందుబాటులో ఉంటూ సకాలంలో సరుకులు అందించేలా చూడాలని, సమయ పాలన పాటించాలని సూచించారు. రేషన్ డిపో డీలర్ల సంఘ అధ్యక్షుడు కోనపల్లి రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పీ-4 సర్వే వేగవంతం


మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషారాణి

మునగపాక: పేదరిక నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ హాల్‌లో శనివారం పంచాయతీ కార్యదర్శులు,డిజిటల్ అసిస్టెంట్లు,మహిళా పోలీసులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో పీ–4 సర్వే వేగవంతం చేయాలని, నిర్దేశించిన లక్ష్యం చేరుకునేలా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సర్వే పక్కాగా జరిగేలా చూడాలన్నారు.

ఉపాధి కూలీల వేతనాలు చెల్లించాలి


నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

ఎస్.రాయవరం: జేవీపాలెం ఉపాధి కూలీలకు ఉపాధి వేతనాలు చెల్లించాలని వ్యవసాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. సత్యనారాయణ డిమాండ్ చేశారు. గ్రామంలో ఉపాధి కూలీలతో కలిసి శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 వారాలుగా ఉపాధి కూలి చెల్లించక పోవడంతో వేతనదారులు పస్తులు ఉండాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే కూలి నగదుచెల్లించాలని కోరారు.

స్మార్ట్ మీటర్లతో అదనపు భారం


అవగాహన కల్పిస్తున్న సీపీఎం నాయకుడు సోమునాయుడు

అచ్యుతాపురం రూరల్ : స్మార్ట్ మీటర్ల వల్ల వినియోగదారులపై అదనపు భారం పడుతుందని సీపీఎం నాయకుడు కూండ్రపు సోమునాయుడు తెలిపారు. స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే ఇబ్బందుల గురించి భోగాపురంలో శనివారం ఇంటింటా ప్రచారం చేశారు. ఇళ్లకు స్మార్ట్ మీటర్లు వద్దు, కరెంటు చార్జీలు తగ్గించాలంటూ నినాదాలు చేసి, కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.పద్మ, బి.శ్రవంతి, కె.రాముతల్లి, సిహెచ్ రాములమ్మ, జి.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

లారీ నుంచి కిందపడిన కంటైనర్


లారీ నుంచి జారి రోడ్డుపై పడిన కంటైనర్

అచ్యుతాపురం రూరల్ : మండలంలోని ఎస్ఈజెడ్ పునరావాస కాలనీలో నాయనమ్మపాలెం వెళ్లే మార్గంలో గోతుల్లో పడి ఓ లారీ అదుపుతప్పడంతో దానిపై ఉన్న భారీ కంటైనర్ జారి కింద పడింది. వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం ఉదయం సెయింట్ గోబిన్ పరిశ్రమ నుంచి కంటైనర్‌ను లారీపై లోడ్ చేసుకుని వస్తుండగా రహదారిపై ఉన్న భారీ గుంతలను తప్పించలేకపోవడంతో ఆ కుదుపులకు కంటైనర్ ఒక్కసారిగా కింద పడిపోయింది. ఆ సమయంలో ఆ పక్కన ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్టయింది. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఒక వైపు పాడైన రోడ్డు, మరో వైపు ఆ మార్గంలో భారీవాహనాల రాకపోకలతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు తీవ్ర భయాందళనలు చెందుతున్నారు. రహదారులకు మరమ్మతులుచేయాలనిస్థానికులుకోరుతున్నారు.

మోదకొండమ్మ ఉత్సవం నేడు

కశింకోట: స్థానిక శారదానది అవతల పొలాల్లో మోదకొండమ్మ ఉత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి పూజలు జరుగుతాయన్నారు. కోలాటాలు, చిటికెన భజనలు, తోడపెద్దు సేవ వంటి కార్యక్రమాలతో శారద వంతెన వద్ద నుంచి అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజలు ఉత్సవంలో పాల్గొవాలని కోరారు.

ఐటీఐ అడ్మిషన్ల కౌన్సెలింగ్ వాయిదా

పాయకరావుపేట : స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాల కోసం ఈనెల 21న నిర్వహించవలసిన కౌన్సెలింగ్‌ను 23వ తేదీకి వాయిదా వేసినట్లు ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆ రోజు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. ప్రభుత్వ ఐటీఐలో ఉదయం 8 గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

స్నేహితుని కుటుంబానికి చేయూత


స్నేహితుని కుటుంబానికి బాండ్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటకు చెందిన పూర్వ విద్యార్థి శౌంత్యాన నాగేశ్వరరావు కుటుంబాన్ని ఆదుకునేందుకు స్నేహితులు శనివారం ఆర్థికసాయం చేశారు. నాగేశ్వరరావు ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. శనివారం నాగేశ్వరరావు సంతాప సభ నిర్వహించారు. 1994–95 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు స్నేహితుని కుటుంబానికి రూ.50వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌తో పాటు బియ్యం బస్తా, రేషన్ సరకులను అందజేసి మానవత్వం చాటుకున్నారు.కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు యల్లపు సత్యనారాయణ,ఆడారి వెంకట సత్యనారాయణ,కాండ్రేగుల కృష్ణ ప్రసాద్, దొడ్డి రమణ, కర్రి భాస్కరరావు.కమాండర్ పట్టాభి,శరగడం ఆదివిష్ణు,డాక్టర్ రవి,దొడ్డి రామకృష్ణ,యల్లపు నాగేష్, ఆడారి పద్మ, కాండ్రేగుల జానకీరామ్,శివాజీ, జయభవాని,టి.వి. రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలపై కూలిన భారీ వృక్షం

- తప్పిన ప్రమాదం
- దెబ్బతిన్న మూడు షాపులు


జల్లూరులో దుకాణాలపై కూలిన భారీ చెట్టు


చెట్టు కూలడంతో ధ్వంసమైన షాపును చూపిస్తున్న బాధితురాలు

కోటవురట్ల: జల్లూరు మెయిన్ రోడ్డులో ఓ భారీ వృక్షం మూడు దుకాణాలపై కూలింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జల్లూరు మెయిన్‌రోడ్డులోని ప్రధాన కూడలిలో భారీ వృక్షం వేళ్లతో సహా శనివారం కూలిపోయింది. వృక్షం మెయిన్‌రోడ్డుపై కాకుండా వెనక్కి దుకాణాలపై కూలింది. పెద్ద శబ్దంతో వృక్షం కూలిపోతుండగా దుకాణాల్లో ఉన్న వారు బయటకు పరుగులు తీయడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటనలో సుర్ల అమ్మాజీకి చెందిన దుకాణం సగం వరకు ధ్వంసమైంది. పెద్ద శబ్దం రావడంతో భయంతో బయటకు పరుగులు తీయడంతో ప్రమాదం తప్పిందని ఆమె తెలిపింది. దుకాణం ధ్వంసంకావడంతో నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కోరింది. ఈ ఘటనలో మూడు దుకాణాలు దెబ్బతిన్నాయి.

ప్లాస్టిక్ రహితంగా గ్రామాలు


వెంకటాపురంలో ప్లాస్టిక్ నిషేధించాలని కోరుతూ ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్ తాతాజీ తదితరులు


శ్రీరాంపురంలో నిర్వహిస్తున్న అవగాహనా ర్యాలీ


తిమ్మాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది


నక్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో, సీఐ తదితరులు

ఎస్.రాయవరం: గ్రామాలు ప్లాస్టిక్ రహితంగా మారాలని సర్పంచ్ కర్రి సత్యనారాయణ అన్నారు. స్వర్ణ ఆంధ్రా స్వచ్ఛాంధ్రా కార్యక్రమంలో భాగంగా శనివారం తిమ్మాపురంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మునగపాక: ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలని వెంకటాపురం సర్పంచ్ సుందరపు తాతాజీ కోరారు. పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ నిషేధం తప్పనిసరి అని చెప్పారు. స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెంకటాపురంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడ్డ సంచులను వినియోగించాలన్నారు.

పాయకరావుపేట : ప్లాస్టిక్ వస్తువులను ఉపయోగించడం హానికరమని సచివాలయ, పీహెచ్‌సీల సిబ్బంది తెలిపారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శ్రీరాంపురం లో శనివారం అవగాహనర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ డబ్బాలు, పాలిథిన్ కవర్లు ఉపయోగించడం ఆరోగ్యానికి హానికరమని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వై.వి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి: స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రం నక్కపల్లిలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. పోలీస్‌స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లో ఉన్న చెత్తను తొలగించారు. తడి,పొడిచెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఎంపీడీవో సీతారామరాజు, సీఐ కుమార స్వామిల ఆధ్వర్యంలో పోలీస్‌సిబ్బంది, పంచాయతీ సిబ్బంది స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని, సంపూర్ణ ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనలో భాగస్వాములవుతామంటూ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్ : పరిసరాలు పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా జీవించవచ్చని అచ్యుతాపురం సర్పంచ్ భర్త కూండ్రపు వెంకినాయుడు అన్నారు. అచ్యుతాపురం, రామన్నపాలెం గ్రామాల్లో శనివారం స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమైన జీవనం సాగించాలంటె ప్లాస్టిక్ వాడకం నిషేధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న ఎంఈవో–1 వేణుగోపాలరావు

మునగపాక: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో వేణుగోపాలరావు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం మునగపాక,గణపర్తి స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ సమావేశాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అభ్యసన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఎంఈవో–2 బుద్ధ శివనాయుడు, హెచ్ఎంలు శ్రీనివాసరావు,రోజామణి,గాలి అప్పారావు, శంకరరావు, సీఆర్ఎంటీలు కర్రి లక్ష్మీనారాయణ,అచ్యుతకృష్ణ,సత్తిబాబు,గోవింద, నూకేష్ తదితరులు పాల్గొన్నారు. శిక్షణ కార్యక్రమానికి ఎం.వై.రాము, ఆర్.ఎస్.ఎస్.మూర్తి, విజయవాణి,కల్యాణ్,సృజన తదితరులు ఆర్‌పీలుగా వ్యవహరించారు.

మోసం చేయడంలో చంద్రబాబు ఘనుడు


క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగులు, మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణ రాజు తదితరులు


సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

కోటవురట్ల: ప్రజలను నమ్మించి మోసం చేయడంలో చంద్రబాబును మించిన ఘనుడు దేశంలోనే లేరని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు అన్నారు. మండలంలోని తంగేడులో మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు నివాసంలో పార్టీ మండల విస్తృతస్థాయి సమావేశాన్ని పార్టీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో జోగులు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. కానీ చంద్రబాబు బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలను మరిచిపోవాలన్న కుట్రతో డైవర్షన్ రాజకీయాలతో అరాచక పాలన చేస్తున్నారన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలనే కాపీ కొట్టి పేర్లు మార్చి ఇంకా ఎక్కువ ఇస్తానని చెప్పి నిలువునా మోసం చేశారని విమర్శించారు. ఖరీఫ్ సీజను ప్రారంభమైనా నేటికీ అన్నదాతలకు సుఖీభవ పథకం అమలు చేయలేదని, నిబంధనలు లేకుండా సూపర్ సిక్స్ అమలు చేస్తానని వాగ్దానం చేసి ఇంటింటికీ బాండ్లు పంచి ప్రజలను మోసగించారని, ఇపుడు విద్యుత్ బిల్లులతో లింకు పెట్టి తల్లికి వందనం పథకం మంజూరు చేయకుండా చాలా మందికి ఎగనామం పెట్టారని విమర్శించారు. చంద్రబాబు చేసిన మోసాలను 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ' కార్యక్రమంతో ప్రజలకు వివరించాలన్నారు. ఇందుకోసం వైఎస్సార్ సీపీ ఓ క్యూ ఆర్ కోడ్‌ను విడుదల చేసిందని, దానిని స్కాన్ చేస్తే చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కలిసి ప్రజలను ఎలా మోసం చేశారో అర్థమవుతుందన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా అంతా ఐకమత్యంగా పనిచేయాలన్నారు. 2027 ఆఖరులో కానీ లేదా 2028 సంవత్సరం ప్రారంభంలో గాని జమిలీ ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని, అదే జరిగితే స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడే అవకాశం ఉందన్నారు. ఏ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంట్ పరిశీలకుడు డి.వి.సూర్యనారాయణరాజు మాట్లాడుతూ పార్టీ పటిష్టతలో భాగంగా త్వరలో మండల స్థాయి కమిటీలు ఏర్పాటుచేయనున్నట్లు చెప్పారు. అందరి ఆమోదంతోనే కమిటీ సభ్యుల ఎంపిక ఉంటుందని చెప్పారు. కష్టపడిన ప్రతి ఒక్కరికీ పదవులు లభిస్తాయని స్పష్టం చేశారు. చంద్రబాబు నిజస్వరూపాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై ఉందన్నారు. చంద్రబాబు ఇంటింటికీ బాండ్లు పంచి మరీ నిలువునా మోసం చేశారన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్. సీతారామరాజు మాట్లాడుతూ వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకుంటే కార్యకర్తలకు కూడా మేలు జరుగుతుందని చెప్పారు. అనంతరం చంద్రబాబు మోసాలను వివరించే క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.ఎస్. సత్యనారాయణరాజు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, పార్టీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, యల్లపు కుమారరాజా, అయ్యపురెడ్డి రాజులనాయుడు, ఆర్ఎస్ లక్ష్మీనరసింహరాజు, ఎంపీటీసీలు పెట్ల రాంబాబు, కాళ్ల రత్నం, వంగలపూడి రాంబాబు, సర్పంచులు ఎరుకునాయుడు, కన్నంరెడ్డి వరహాలబాబు, కొరుప్రోలు శివకుమార్, పైల శివరాం, గోపాలకృష్ణ, రమణ, గుడివాడ పావని, పార్టీ నాయకులు శానాపతి గోపాలకృష్ణ, పైల నాని, రుత్తల గోవిందు, చీకట్ల వెంకట్, తేటకాయల నారాయణరావు, గెంజి వెంకటరమణ, దొడ్డి రమేష్, గవ్వా రాధాకృష్ణ, చవ్వాకుల చిన్న, పులి చంటి, సుంకర గిరి, అప్పారావు, పారుపల్లి శ్రీనివాసరావు, కొమారు రమణ, బాబులు, బత్తుల గోవిందు, చామంతుల శ్రీనివాసు, సురేష్, పెట్ల బాబులు, సూరిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు అందజేసేందుకు కృషి

అనకాపల్లి: ఖరీఫ్ పంటలు వేసుకునేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని, వారికి విత్తనాలు అందజేసేందుకు కృషి చేస్తామని అనకాపల్లి డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రావు తెలిపారు. స్థానిక మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో డివిజన్ పరిధిలో అనకాపల్లి, మునగపాక, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లోని రైతు సేవా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి శిక్షణ ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో రైతులకు కావలసిన విత్తనాలు, పరికరాలు అందుబాటులో ఉంచాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ


గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకుడిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు

ఎస్.రాయవరం: కష్టకాలంలో కార్యకర్తలు, నాయకులు ధైర్యంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే, పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు అన్నారు. రేవుపోలవరంలో ఇటీవలప్రమాదవశాత్తూ పడి గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చోడిపల్లి గోవిందును ఇంటివద్ద శనివారం పరామర్శించి, గాయాలనుంచిత్వరగాకోలుకోవాలనిఆకాంక్షించారు. అదే గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త చోడిపల్లి దేవుడు ఇటీవల గుండెపోటుతో మరణించాడు. మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు శనివారం దేవుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు, ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు,వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, జిల్లా కమిటీ సభ్యుడు కొణతాల శ్రీనివాసరావు,మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ,గుడివాడ సర్పంచ్ దూళి శ్రీనుబాబు,యూత్ నాయకులు పోచిన నరేష్, చొప్పా రాజు, పాలుమూర్తి అప్పలరాజు ఉన్నారు.

వివాదాలకు తావు లేకుండా సమస్యలు పరిష్కరించుకోవాలి


అర్జీదారుల సమస్యలు వింటున్న మండల స్థాయి అధికారులు

మునగపాక: వివాదాలకు తావులేకుండా సమస్యలను స్థానికంగా పరిష్కరించుకోవాలని తహసీల్దార్ పి.సత్యనారాయణ సూచించారు . స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల అధికారుల సమన్వయ కమిటీ సమావేశంలో పలువురు అర్జీదారుల సమస్యలపై మాట్లాడారు. ఇరువర్గాల వారు సంయమనం పాటిస్తూ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ఎంపీడీవో ఎం.ఉషారాణి,ఏఎస్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.